క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

యలమంచిలి: దసరా సందర్భంగా పాలకొల్లులో నివాసం ఉంటున్న పెనుగొండ సూర్యనారాయణ, నాగ తులసి దంపతులు తమ స్వగ్రామమైన బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం 50 మంది నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో శిరిగినీడి సత్యనారాయణ-సంగీత, డాక్టర్ గునిశెట్టి కృష్ణ, డాక్టర్ రాజిత, కోటిపల్లి మణికంఠ, సాయి హరిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యల పూజ



నగరేశ్వర స్వామి ఆలయంలో కన్యల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో 102 కన్యల పూజ భక్తి శ్రద్ధలో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో నగరేశ్వర స్వామి ఏకాదశ రుద్రాభిషేకాలు, మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య 102 కన్యల పూజ నిర్వహించారు. పెనుగొండ పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది చిన్నారులు 102 కన్యల పూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

మందాలమ్మ సేవలో 'కోర్టు' సినిమా నటుడు



భక్తి గీత మాలికను ఆవిష్కరిస్తున్న కోర్టు నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆశీస్సులతో ఎందరో ఉన్నత శిఖరాలకు చేరుకొన్నారని వడలి గ్రామ వాసి, సినీ నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వడలిలో మందాలమ్మ ఆలయ ప్రాంగణంలో మందాలమ్మ భక్తి గీత మాలిక యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి శ్రీను, పేరిచర్ల నాగశ్రీను, అత్యం శ్రీనివాసు, గణపతినీడి బుల్లియ్య, చుక్కా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచ హారతులు



మేడపాడులో కనకదుర్గమ్మకు పంచ హారతులు ఇస్తున్న యువతులు

యలమంచిలి: మేడపాడులో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద మంగళవారం రాత్రి అమ్మవారికి పంచ హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. అంతకుముందు భాగవతులు వేణుగోపాల శాస్త్రి (గోపి) బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన కొడవటి వెంకటేశ్వరరావు (బాలు), కమల దుర్గ దంపతులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

పనిభారం కూటమి కుతంత్రం

ఆకివీడు: కార్మికులపై పని భారం పెంచడం కూటమి కుతంత్రమేనని సీఐటీయూ మండల కార్యదర్శి కే.తవిటినాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద మండల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి మండల నాయకులు పెంకి అప్పారావు అధ్యక్షత వహించారు. తవిటినాయుడు మాట్లాడుతూ కరోనాతో ప్రజలు, కార్మికుల ఆరోగ్యాలు కుంచించుకుపోయాయన్నారు. అంతంత మాత్రంగానే ఉన్న ఆరోగ్యంతో పూట గడవడం కష్టమైనప్పటికీ పనులకు వెళ్లి కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో 13 గంటల పనిదినాల్ని తీర్మానం చేయడం దారుణమన్నారు. పరిశ్రమల వద్ద కార్మికులకు సరైన వసతులు లేవని, లేబర్ అధికారులు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఆయా పరిశ్రమల్ని తనిఖీలు చేసిన దాఖలాలు లేవని తవిటినాయుడు ఆరోపించారు. కార్యక్రమంలో బీరా శ్రీను, మనోహర్, తోట పద్మ, కన్యాకుమారి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

- విద్యుత్ స్తంభాలపై యథేచ్ఛగా ఏర్పాటు
- వైర్లు ఎర్త్ కావడంతో ప్రమాదాలకు గురవుతున్న లైన్‌మెన్లు

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ స్తంభాలు అనధికార కేబుల్ వైర్లతో ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇతర కేబుల్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్‌లు అయ్యి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చివరకు ఏ వైర్లు వల్ల ప్రమాదం జరిగిందో గమనించలేని పరిస్థితిలో విద్యుత్ శాఖ అధికారులు సతమతమవుతున్నారు. సహజంగా విద్యుత్ స్తంభానికి ప్రధాన వైర్లు మూడు లేఖ నాలుగు ఉంటాయి. వాటికి గృహ, వ్యాపార సంస్థలు, ఇండస్ట్రీయల్ నుంచి వచ్చే కనెక్షన్‌లను దగ్గర్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు కలుపుతుంటారు. పోల్ పై ఏదైనా సమస్య వస్తే స్తంభం ఎక్కి సంబంధిత కనెక్షన్ వైర్లను సరిచేసి విద్యుత్‌ను సరఫరా చేస్తుంటారు. పట్టణంలో ఉన్న ప్రతీ విద్యుత్ స్తంభానికి ఇంటర్‌నెట్, సిటీ కేబుల్, జనరేటర్ ఇలా కొన్ని విభాగాలకు సంబంధించిన కేబుల్ వైర్లను కూడా విద్యుత్ స్తంభాలకే అమర్చుకుంటూ వెళ్లడంతో ఏ విద్యుత్ స్తంభం చూసినా సరే సాలెగూడు అల్లుకున్నట్లుగా ఉంటున్నాయి. గతంలో విద్యుత్ లైన్‌మెన్లు పోల్ ఎక్కాలంటే నేరుగానే ఎక్కేవారు. పోల్ ఎక్కలేని పరిస్థితి ఉంటేనే నిచ్చెనలు వాడేవారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే నిచ్చెన లేనిదే పోల్ ఎక్కలేని పరిస్థితి ఏర్పడింది.



విద్యుత్ స్తంభానికి సాలెగూడులో అల్లుకున్న అనధికార వైర్లు



మెయిన్ రోడ్డులో విద్యుత్ స్తంభం కనిపించకుండా చుట్టేసిన అనధికార వైర్లు

అనధికారికంగా కేబుల్ వైర్లు

పట్టణంలో ఏ విద్యుత్ స్తంభం చూసినా సరే సాలెగూడు అల్లినట్లుగా అనధికార కేబుల్ వైర్లుతో నిండిపోయి ఉంటున్నాయి. విద్యుత్ వినియోగదారులకు ఏదైనా విద్యుత్ సమస్య వస్తే లైన్‌మెన్‌లు పోల్ ఎక్కాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కొందరు లైన్‌మెన్‌లు విద్యుత్ పోల్ ఎక్కుతుంటే ఆ పోల్‌కు ఉన్న జనరేటర్ కేబుల్ వైరు నుంచి విద్యుత్ రివర్స్ రావడంతో షాక్‌కు గురై లైన్‌మేన్‌లు కిందపడిపోయిన సంఘటనలు కొన్ని చోటు చేసుకున్నాయి. వీటిని వెలుగులోకి రానీయకుండా అధికారులు జాగ్రత్తలు వహిస్తున్నారు.

ఒక్క సొంత పోల్ కూడా లేకుండానే

నెట్, సిటి కేబుల్, జనరేటర్ ఇలా ఏ కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలన్నా వారికి సొంత పోల్స్ వేసుకుని వైర్లు రన్ చేసుకోవాలి. దీనికి అధికంగా ఖర్చులు అవుతాయని వీటి ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలనే వారి సొంత జాగీరుల్లా వాడేసుకుంటున్నారు. వీటి వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా వీరు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏదైనా నష్టం జరిగితే మాత్రం లైన్‌మేన్‌లు నష్టపోతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ లైన్‌మేన్‌ల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు లేని అనధికార వైర్లను తొలగించాలని విద్యుత్ శాఖ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

రాత్రి ప్రమాదం.. ఉదయానికే సిద్ధం

సోమవారం రాత్రి పట్టణంలో అటుకుల మండపం రామాలయం వద్ద విద్యుత్ స్తంభం నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆ పోల్‌ని ఉన్న వైర్లు మొత్తం కాలిపోయాయి. కొన్ని వైర్లు తెగి రోడ్డుపై పడిపోయాయి. ఇంత జరిగి 24 గంటలు కూడా కాలేదు. మళ్లీ కేబుల్ వైర్లు ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు సిద్ధపడడం గమనార్హం. విద్యుత్ స్తంభానికి కట్టవద్దని చెబుతుంటే పొలిటికల్ ఒత్తిళ్లు వస్తుండడంతో ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో విద్యుత్ శాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేబుల్ వైర్ల సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

లైన్‌మెన్లకు చాలా కష్టం



పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాల పరిధిలో ఉన్న కేబుల్ ఆపరేటర్లు, నెట్‌వర్క్ ఆపరేటర్లు, జనరేటర్ ఆపరేటర్లకు సంబంధించిన కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ లైన్‌మేన్‌లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనధికారికంగా ఉన్న కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాల నుంచి తొలగించాలి. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– చిటికెన రామకృష్ణ, డీఈఈ, తూర్పు ప్రాంత విద్యుత్ శాఖ, పాలకొల్లు

మంటలతో భయం



కరెంటు స్తంభంపై ఒక్కో సారి అకస్మాత్తుగా మంటలు వస్తుంటే భయం వేస్తుంది. కరెంటు స్తంభంపై ఉన్న వైర్లు చూస్తుంటే ఒక్కోసారి మాకే పిచ్చెక్కించేంతగా అనిపిస్తుంది. విద్యుత్ స్తంభంపై వల వేసినంత దారుణంగా వైర్లు ఉంటున్నాయి. ఒక్కోసారి లైన్‌మెన్‌లు స్తంభం ఎక్కడం చూస్తుంటే అయ్యో పాపం అనిపిస్తుంది.

– నలాది వేణు, కొరియర్ సెంటర్, పాలకొల్లు

చేతికి అందేలా వైర్లు



విద్యుత్ స్తంభాలపై వైర్లు చూస్తుంటే ఏది కరంటు వైరో ఏది నెట్, కేబుల్, జనరేటర్ వైర్లో అర్థం కావడంలేదు. కొన్ని సందర్భాల్లో వైర్లు తెగి పడుతుంటే భయాందోళనలు కలుగుతున్నాయి. కొన్ని చోట్ల వైర్లు చేతికి అందేలా ఉంటున్నాయి. ఏదైనా ఇన్ని వైర్లు విద్యుత్ పోల్‌కు ఉండడం ప్రమాదకరమే. ముఖ్యంగా విద్యుత్ లైన్‌మెన్‌ల గురించి ఉన్నతాధికారులు ఆలోచించాలి.

– పెదమల్లు రమేష్, స్థానికుడు, పాలకొల్లు

నిరసన తెలుపుతూనే పింఛన్ల పంపిణీ

యలమంచిలి: సచివాలయ ఉద్యోగులు నిరసన తెలుపుతూనే బుధవారం అక్టోబర్ నెల పింఛన్లు పంపిణీ చేస్తారని ఉద్యోగుల సంఘం నాయకుడు షేక్ ఉమర్ ఆలీషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులను కష్టపెట్టకూడదని రాష్ట్ర యూనియన్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని సచివాలయ ఉద్యోగులంతా బాధ్యతగా తీసుకుని పాటించాలని ఆయన కోరారు.

వైద్యుడిపై విచారణ

ఆకివీడు: స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న దంత వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని వచ్చిన ఆరోపణలపై భీమవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రవీణ్ కుమార్ విచారణ నిర్వహించారు. జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ పగడాల సూర్యనారాయణ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఆకివీడు సీహెచ్‌సీ, ఉండి, కాళ్ల, పెదకాపవరం పీహెచ్‌సీల్లో విధులకు హాజరు అవుతున్నదీ లేనిది ఆయా వైద్యుల ద్వారా లిఖిత పూర్వక నివేదిక తీసుకున్నారు. కాగా దంత వైద్యులు మూడు రోజులు ఆకివీడు సీహెచ్‌సీలోనూ, మరో మూడు రోజులు రూరల్ పీహెచ్‌సీల్లో పనిచేయాల్సి ఉండగా, ఆయా పీహెచ్‌సీలకు వెళ్లడం లేదని ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించినట్లు సూర్యనారాయణ చెప్పారు.

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే రెండు ఎస్సీ బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. గ్రామంలో కొప్పు వెలమలకు రూ.10 లక్షలతో, శెట్టిబలిజలకు రూ.10 లక్షలతో రెండుబీసీ కమ్యూనిటీ భవనాలు నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు.

ఓంకార రూపిణి.. శక్తి స్వరూపిణి



పెనుగొండ: ప్రత్యేకాలంకరణలో మూలవిరాట్ వాసవీ మాత



పెనుగొండ: దుర్గాదేవిగా మహిషాసురమర్దని



నరసాపురం రూరల్: ఎల్బీచర్లలో దుర్గాదేవి అమ్మవారు

నరసాపురం: పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద జరుగుతున్న 41వ దేవీనవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. పాతబజార్ వలవల వారి వీధి వద్ద, రాయిపేట పుంతలో ముసలమ్మ వారి ఆలయం వద్ద, గడ్డిబజార్‌వద్ద ఉన్న ప్రసిద్ధ కనకదుర్గ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చినమామిడిపల్లి నాగారమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయిపేట కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

నరసాపురం మండలంలో...

నరసాపురం రూరల్: మండలంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కొప్పర్రు గ్రామంలో పోలిశెట్టి గోపీనాద్ ఇంటివద్ద ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సారవ గ్రామంలో ముత్యాలమ్మ ఆలయంవద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.బేతపూడి గ్రామంలోని దుర్గాదేవి ఆలయాలలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఎల్బీచర్ల సెంటరులో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. లిఖితపూడిలోని దానేశ్వరి అమ్మవారు, లక్ష్మణేశ్వరంలోని గోగులమ్మ అమ్మవార్లతో పాటు మొగల్తూరు మండలంలోని ఆకనవారి తోటలో ఏర్పాటు చేసిన వినాయకుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: శరన్నవరాత్రులు పురస్కరించుకుని మంగళవారం సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ గోగులమ్మ వారలకు పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి, రాధా దంపతుల ఆధ్వర్యంలో సామూహిక కలశారాధన, కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం నడివీధిలోని పోతురాజు గుడి నుంచి కలశాలతో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు ముందుగా సామూహిక కలశ పూజలు నిర్వహించి, అనంతరం మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు కర్రి ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వనం సూర్యనారాయణ, ఉప సర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి పాల్గొన్నారు.



పెనుగొండ: దుర్గాదేవిగా దర్శనమిస్తున్న వాసవీ శాంతి ధాంలో మరకతశిల వాసవీ మాత



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో కనకదుర్గాదేవి



నరసాపురం: ప్రత్యేక అలంకరణలో రాయిపేట కనకదుర్గమ్మ

పెనుగొండలో...

పెనుగొండ: శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి పురస్కరించుకుని ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో మరకతశిల వాసవీ తను దుర్గా దేవిని అలంకరించి పూజలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని నవదుర్గదేవిగా అలంకరణ చేశారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు చేశారు. రాత్రి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక చిన గోపురం వీధిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారిని నవదుర్గాదేవిగా అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు కనకదుర్గమ్మకు కుంకుమ పూజలు చేశారు. వివిధ కూడళ్లలో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద విద్యార్థులతో సరస్వతి దేవికి పూజలు చేయించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పెనుమంట్ర: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: కొప్పర్రులో పూజలు చేస్తున్న భక్తులు



పాలకొల్లు సెంట్రల్: ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నవదుర్గాదేవి

పశువులకు జోరుగా వ్యాక్సినేషన్

గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం



గేదెలకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేస్తున్న మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేకరరెడ్డి (ఫైల్)

యలమంచిలి: వర్షాకాలం, వేసవి కాలం ప్రారంభ సమయంలో ఏర్పడే వాతావరణ మార్పు వల్ల పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధులలో గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైనది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ సిబ్బంది గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ వ్యాధి సోకితే పశువు ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి ప్రభావం ఎక్కువైతే మరణించే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తుగానే ఈ వ్యాక్సిన్ వేయించాలని పశువుల వైద్యులు కోరుతున్నారు.

ప్రతి పశువుకు వ్యాక్సిన్ వేయించాలి



వ్యవసాయం చేసే రైతులు అదనపు ఆదాయం కోసం పశువులను పెంచుతుంటారు. వీరితోపాటు కేవలం పాడి రైతులు (వ్యవసాయం లేకపోయినా) కూడా మన డివిజన్‌లో అధికంగా ఉన్నారు. వీరంతా పశువులను తమ సొంత బిడ్డల్లా సాకుతుంటారు. వాటికి ఏ కష్టం వచ్చినా అల్లాడుతుంటారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో గాలికుంటు వ్యాధి రాకుండా ప్రభుత్వం వేయిస్తున్న ఉచిత వ్యాక్సిన్ రైతులంతా తమ పశువులకు వేయించాలి.

– డాక్టర్ గేదెల సత్యనారాయణ, పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు

ప్రణాళికతో పక్కాగా వ్యాక్సిన్ అందజేత

గాలికుంటు వ్యాధి నుంచి పశువులను రక్షించేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేయిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం పూట పశు వైద్యులు, గ్రామ పశు సహాయకులు, గోపాలమిత్రలు పశువుల కొట్టాల వద్దకు వెళ్లి ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేకర్‌రెడ్డి పర్యవేక్షణలో పశు సిబ్బంది ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి పశువుకు ఈ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా గ్రామ పశు సహాయకులు రైతులకు సమాచారం ఇస్తున్నారు. ఆ సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాలకొల్లు డివిజన్‌లో..

పాలకొల్లు డివిజన్‌లోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో 4908ఆవులు, 14,033 గేదెలు కలిపి 18,941 పశువులు మొత్తం ఉన్నాయి. ఈనెల 15 ప్రారంభించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంత వరకు 9085 పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 15 వరకు కొనసాగుతుంది.

ఆలయంలో అల్పాహారం పంపిణీ

యలమంచిలి: మండలంలోని గుంపర్రు శ్రీ వల్లీ దేవ సేనా సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ మానేపల్లి రామ లింగేశ్వరరావు ఈ విజయ దశమినుంచి ఆలయానికి వచ్చే భక్తులకు మధ్యాహ్న సమయంలో అల్పాహారం అందివ్వాలని సూచించారు. ఆయన సూచన మేరకు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కెవిఎస్ సత్యనారాయణమూర్తి మంగళవారం భక్తులకు అల్పాహారం అందజేశారు.

వడ్డీ రాయితీ సొమ్ము అందజేత

పెనుగొండ: ఇలపర్రు సొసైటీలో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉంచినట్లు ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ఛైర్మన్ కేతా సత్తిబాబు తెలిపారు. మంగళవారం ఇలపర్రు సొసైటీలో రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ సొమ్ము 2022-23 సంవత్సరానికి గాను 165 మంది రైతులకు రూ.2,98,216ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చేకూరి నరసింహరాజు, నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

బస్సు స్టేజ్ ఏర్పాటు చేయాలి

భీమవరం: అనేక గ్రామాలకు కేంద్రంగా ఉన్న నవుడూరు సెంటర్‌లో ఆర్టీసీ స్టేజి ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలో ఆర్టీసీ ఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. నవుడురు సర్పంచ్ నల్లమిల్లి వేణుక, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్లబండి ఇందిర ఆర్టీసీ స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి సంతకాలు సేకరించి ఆర్టీసీ రీజనల్ మేనజర్ వరప్రసాద్‌ను కలసి అందించారు.